నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 28 మే 2024 | VIKARABAD

ఈదురుగాలులతో..



సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కాగా, అల్పపీడనం కారణంగా గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆదివారం నగరంలో గరిష్ఠం 40.2 సెల్సియస్‌గా నమోదుకాగా.. సోమవారానికి 2.4 తగ్గి 37.8 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ఠం 27.0 డిగ్రీల సెల్సియస్‌గా, గాలిలో తేమ 46 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

చెయ్యిచ్చింది..

రెండో విడుత గొర్రెల పంపిణీకి మంగళం పాడిన కాంగ్రెస్ ప్రభుత్వం

- నిరాశలో లబ్ధిదారులు..
- డీడీలు వాపస్ ఇవ్వాలని సర్కారు నిర్ణయం
- రంగారెడ్డి జిల్లాలో అర్హులు 735 మంది
- వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు అధికారుల చర్యలు
- ప్రభుత్వంపై మండిపడుతున్న గొల్లకురుమలు

రంగారెడ్డి, మే 27 (నమస్తే తెలంగాణ) : కులవృత్తులకు జీవం పోయాలి.. గొల్లకురుమల జీవితాలు మారాలి.. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చి సొంత ఊరిలోనే ఆర్థికంగా ఎదగాలి.. ఇంటిల్లిపాదీ మెతుకు తినాలె..' అన్న సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం ఆరేండ్ల క్రితం ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడింది. బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో మొదటి విడతలో రూ.1.32 కోట్లను వెచ్చించి 11,685 యూనిట్లను గొల్లకురుమలకు పంపిణీ చేసింది. రూ.300 కోట్లను ఖర్చు చేసి గతేడాది జూన్ నుంచి రెండో విడత గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ పంపిణీకి బ్రేక్ పడింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం అమలుపై 'చేయి'ఎత్తేసింది. అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే రెండో విడత గొర్రెల పంపిణీని చేపడతామని అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి నీళ్లొదిలింది. గొర్రెల కోసం డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు డీడీలను వాపస్ ఇస్తున్నది. ప్రభుత్వ తీరుపై గొల్లకురుమలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీడీలు వాపస్..

రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించి 735 మందికి గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉన్నది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీపై ఎన్నికల్లోనూ హామీ ఇవ్వడంతో గొల్లకురుమలు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. అయితే అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం కొనసాగింపుపై ఎటు వంటి స్పష్టత ఇవ్వలేదు. గొర్రెలు పంపిణీ చేయాలని పలుమార్లు లబ్ధిదారులు ఆందోళనలు కూడా చేశారు. లేనిపక్షంలో వాటా ధనాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో చివరకు ప్రభు త్వం ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు సంకల్పించి డీడీలు వాపస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నది. గొర్రెల యూ నిట్‌కు వాటా ధనం చెల్లించిన వారి ఖాతాల్లో తిరిగి జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు వారి ఖాతాల్లో డబ్బులు చేసేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ ఖాతాల్లో జమ చేయాలో తెలపాలంటూ ఓ ఫార్మాట్‌ను తయారు చేసి రైతుల వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం 102 మందికి సంబంధించి వివరాలు రావడంతో వారికి డబ్బులు చెల్లించేందుకు కలెక్టర్‌కు ఫైల్ పెట్టినట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. మిగతా వారి వివరాలు వచ్చిన వెంట నే వారి ఖాతాల్లోనూ డబ్బులను జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఇన్నాళ్లుగా గొర్రెల కోసం నిరీక్షించిన గొల్లకురుమలు మండిపడుతున్నారు.

అద్భుత ఫలితాలిచ్చిన పథకం..

గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకం జిల్లాలో అద్భుత ఫలితాలను ఇచ్చింది. జిల్లాలో 2017 జూన్‌లో మొదటి విడతలో 11,685 మంది గొల్లకురుమలకు 2,45,385 గొర్రెలను పంపిణీ చేసింది. తొలి విడతలో సబ్సిడీపై రూ.1.25 లక్షల విలువైన 21 గొర్రెలను రూ.31,750కే అందించిన అప్పటి ప్రభుత్వం ఆ తర్వాత యూనిట్ విలువను రూ.1.75 లక్షలకు పెంచి లబ్ధిదారుడి వాటాగా రూ.43,450కే అందించింది. గతేడాది నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జూన్ 9న జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. 2 వేల మంది గొల్లకు రుమలు డీడీలు చెల్లించి పథకానికి దరఖాస్తు చేసుకోగా..అసెంబ్లీ ఎన్నికల నాటికి 1,265 యూనిట్లకు అధికారులు గొర్రెలను పంపిణీ చేశారు. ఎన్నీడీపీ రుణం ఇవ్వకుండా కేంద్రం మోకాలొడ్డినా.. బీఆర్ఎస్ ప్రభుత్వమే సొంతంగా నిధులు సమకూర్చుకుని రెండో విడత పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించింది. జీవాలు అనారోగ్యానికి గురైతే సత్వర వైద్యం అందించేందుకు సంచార వాహనాలను సైతం ఏర్పాటు చేసింది. దూరదృష్టితో చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం సక్సెస్ కావడంతో నేడు ఏ గ్రామంలో చూసినా సర్కారు పంపిణీ చేసిన గొర్రెల మందలే కనిపిస్తున్నాయి. ఈ పథకం ప్రారంభించక ముందు జిల్లాలో 5.35 లక్షలు ఉన్న గొర్రెల సంఖ్య 2023 సంవత్సరానికి వచ్చేసరికి 7,67,125కు పెరిగింది. వలసలకు సైతం ఈ పథకం చెక్ పెట్టింది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ప్రస్తుతం అన్ని కాలాల్లోనూ సమృద్ధిగా నాణ్యమైన మాంసం లభిస్తున్నది. గొర్రెల సంపద మూడింతలు పెరిగి ఆత్మ గౌరవంతో జీవిస్తున్న గొల్లకురుమల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లింది.



'మొబిలిటీ వ్యాలీ'పై
నీలినీడలు

ఈ భారీ ప్రాజెక్టు ఏర్పాటుపై నెలకొన్న అయోమయం

- అధికారంలోకొచ్చి ఐదు నెలలైనా ఈ అంశాన్ని ప్రస్తావించని కాంగ్రెస్ ప్రభుత్వం
- భూసేకరణ పూర్తై ఏడాది కావొస్తున్నా ముందుకు సాగని పనులు
- 940 ఎకరాల్లో .. రూ.50 వేల కోట్ల పెట్టుబడే లక్ష్యంగా మొబిలిటీ వ్యాలీ ఏర్పాటుకు సంకల్పించిన కేసీఆర్ సర్కార్
- భూములిచ్చిన రైతులకు ఇప్పటికే నష్టపరిహారం చెల్లింపు

వికారాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): జిల్లాకు మణిహారంగా మారనున్నదని భావించిన మొబిలిటీ వ్యాలీకి గ్రహణం పట్టింది. భూసేకరణ పూర్తై ఏడాది కావొస్తున్నా దీనికి సంబంధించిన పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. వెనుకబడిన వికారాబాద్ జిల్లాను ప్రగతిపథంలో ముందుంచేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం మొబిలిటీ వ్యాలీని మోమిన్‌పేట మండలంలోని ఎన్కతలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మొబిలిటీ వ్యాలీ అంశాన్ని ఇప్పటివరకు ప్రస్తావించకపోవడం గమనార్హం. భూసేకరణ పూర్తై.. భూమిని చదును చేసి అభివృద్ధి చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించగా.. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. తదనంతరం డిసెంబర్ మొదటి వారంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఈ భారీ ప్రాజెక్టుపై చర్చించకపోవడంతో నీలినీడలు కమ్ముకున్నాయి. మొబిలిటీ వ్యాలీలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చిన పలు కంపెనీలు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ భారీ ప్రాజెక్టు ముందుకు సాగుతుందో..? లేదోననే..? అయోమయం నెలకొన్నది. ఈ ప్రాజెక్టు.. ఇక్కడే ఉంటుందా.. లేదంటే మరో జిల్లాకు వెళ్తుందా..? అనే అనుమానాలు కూడా జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో టీఎస్-ఐపాస్, టీఎస్-ఐపాస్ వంటి వాటిని తీసుకొచ్చి నూతన శకానికి నాంది పలకడంతోపాటు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించింది. మరీ కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ఏ విధంగా సహకరిస్తుందనే ఆందోళన పారిశ్రామికవేత్తల్లో నెలకొన్నది.

రూ. 50 వేల కోట్ల పెట్టుబడే లక్ష్యంగా..

మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టును 940 ఎకరాల్లో.. రూ.50 వేల కోట్ల పెట్టుబడులతో..4 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోమిన్‌పేట మండలంలోని ఎన్కతలలో ఏర్పాటు చేయాలని సంకల్పించింది. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ గతేడాది సెప్టెంబర్‌లోనే పూర్తి కాగా..టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో భూఅభివృద్ధి పనులను కూడా కొంతమేర చేపట్టారు. అంతేకాకుండా ఈ భారీ ప్రాజెక్టు ఏర్పాటుకు స్వచ్ఛందంగా భూములిచ్చేందుకు ముందుకొచ్చిన వారికి గత ప్రభుత్వం నష్టపరిహారాన్ని కూడా అందజేసింది. ఎన్కతల గ్రామ పంచాయతీ సర్వేనంబర్ -174, 198 పరిధిలోని 636.11 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించిన 400 మంది రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ఎకరానికి రూ.17 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని జమచేసింది. అదేవిధంగా అసైన్డ్‌దారుల కుటుంబాల్లోని అర్హులకు మొబిలిటీ వ్యాలీలో ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు వారి పిల్లలకు నాణ్యమైన చదువును అందించేందుకు ప్రత్యేకంగా బాలురు, బాలికల రెసిడెన్షియల్ బడులను ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కొత్త ప్రభుత్వం అసైన్డ్‌దారులకు ఉద్యోగాలు, తదితర సౌకర్యాలు కల్పించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఆందోళన భూములిచ్చిన వారి కుటుంబాల్లో నెలకొన్నది. మరోవైపు మొబిలిటీ వ్యాలీ పూర్తైతే ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో చాలామంది స్థానికులున్నారు. మొబిలిటీ వ్యాలీలో ఎలక్ట్రిక్ వాహనాలతోపాటు విడి భాగాల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని తెలియడంతో స్థానికంగా భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఎకరం భూమి ధర రూ.కోట్లలో పడగలెత్తింది. అయితే రేవంత్ ప్రభుత్వం ఎలాంటి ప్రస్తావన చేయకపోవడంతో భూముల ధరలు పడిపోవడంతోపాటు చుట్టుపక్కల పూర్తిగా భూముల క్రయవిక్రయాలు ఆగిపోయాయి.

సమీక్షలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

షాబాద్, మే 27 : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వాతావరణ మార్పులపై అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ సూచనలు చేస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు మరింత అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారుల నేతృత్వంలో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చించాలని, చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు, ప్రజలకు రక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే వెంటనే సరిచేసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించడంతోపాటు ఇండ్ల మధ్య వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే దోమలవ్యాప్తిని అరికట్టేందుకు ఆయిల్‌బాల్స్ వేయించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. భారీ వర్షాలతో విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలుగకుండా పునరుద్ధరణ పనులను చేపట్టాలని.. విద్యుదాఘాతాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదనీటి ప్రవాహానికి రహదారులు దెబ్బతినే అవకాశం ఉన్నందున ముందుగా గుర్తించి.. తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. ఎక్కడ కూడా ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న చెరువులు, చెక్‌డ్యాంలు, కాల్వలు తదితర వాటి వివరాలను సేకరించి నివేదికను సమర్పించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల పల్లెబాట..

- విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆఫీసర్లు
- రంగారెడ్డి జిల్లాలో వారం రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం

మొయినాబాద్ మండలంలోని అప్పోజిగూడలో జరిగిన కార్యక్రమంలో విత్తనాలు, ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి

రంగారెడ్డి, మే 27 (నమస్తే తెలంగాణ): ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. దళారులు దిగుబడుల ఆశచూపి నకిలీ విత్తనాలను అంటగడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం నకిలీ విత్తనాలు జిల్లాలోకి వస్తున్నాయి. నకిలీ దందాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి వ్యవసాయ, పోలీస్‌శాఖల భాగస్వామ్యంతో నిఘాను ఏర్పాటు చేస్తున్నది. ఈ నేపథ్యంలో విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యవసాయశాఖ పల్లెబాట పట్టింది. రైతులతో సమావేశాలు నిర్వహించి వారిని చైతన్యపర్చుతున్నది. జిల్లాలో ఈనెల 25 నుంచి ఈ కార్యక్రమం మొదలుకాగా..షెడ్యూలు ప్రకారం వారం రోజులపాటు కొనసాగనున్నది. ప్రతి వ్యవసాయ విస్తరణాధికారి క్లస్టర్ పరిధిలో 2నుంచి 3 గ్రామ పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం మొయినాబాద్ మండలంలోని అప్పోజిగూడ, శంకర్‌పల్లి మండలంలోని మహాలింగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి పాల్గొని రైతులకు విత్తన కొనుగోళ్లపై అవగాహన కల్పించారు.

సరిపడా అందుబాటులో ఉన్నా..

జిల్లాలో వానకాలం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది. అయినా డీలర్లు, మరికొంతమంది కృత్రిమ కొరతను సృష్టిస్తుండడంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ప్రస్తు త వానకాలంలో జిల్లాలోని రైతులు 4,45,428 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసి ప్రణాళికనూ సిద్ధం చేసింది. ఇందులో అత్యధికంగా పత్తి 1,76,174 ఎకరాలు, వరి-1,38,187, మొక్కజొన్న -66,530 ఎకరాలు, ఉద్యాన పంటలతోపాటు ఇతర పంటలను 48,959 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు. సాగు అంచనాకు అనుగుణంగా 44,594 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు నిర్ధారించారు. అలా గే 4,91,036 పత్తి ప్యాకెట్లు అవసరం ఉన్నందున ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు నివేదికను పంపించారు. 1,01,982 టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలు రకాల విత్తనాలు, ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నారు. కొరత అనేదే లేదని..దీనిపై రైతులను చైతన్యపర్చేందుకే అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అవగాహనతోనే మోసాలకు చెక్..

అవగాహనతోనే మోసాలను అరికట్టొచ్చని భావించి వ్యవసాయ శాఖ అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ అవగాహన కార్యక్రమాల్లో ముఖ్యంగా విత్తన కొనుగోళ్ల సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరిస్తున్నారు. లూజుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలను కొనొద్దని సూచిస్తున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన షాపు నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని..విత్తన ప్యాకెట్, బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని.. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆధీకృత డీలర్ల దగ్గరే విత్తనాలను కొనాలని వివరిస్తున్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్ శాఖల సమన్వయంతో జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టామని వివరించి రైతులకు భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.

ఇక్రిసాట్‌లో జాతీయ సదస్సు

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ) : వానకాల సీజన్‌లో పప్పు దినుసుల దిగుబడిని పెంచడమే లక్ష్యంగా ఇక్రిసాట్‌లో జాతీయ సదస్సు జరిగింది. ఆలిండియా కో-ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్టులో భాగంగా వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో అగ్రి పరిశోధన సంస్థలు, రీసెర్చ్ నిపుణులు హాజరయ్యారు. గతేడాది నిర్దేశిత లక్ష్యాల పురోగతి, ఈ సీజన్‌లో చేపట్టాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా కందులు, పెసర్లు, మినుములతోపాటు పలు రకాల పప్పు దినుసుల దిగుబడిని పెంచాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఇక్రిసాట్ నిపుణులు ప్రత్యేక చర్చాగోష్ఠి నిర్వహించారు.

'ఇన్సులిన్'
విక్రయాల్లో అక్రమాలు
పలు మెడికల్ ఏజెన్సీలపై డీసీఏ కొరడా

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): ఇన్సులిన్ మందుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడుతున్న మెడికల్ ఏజెన్సీలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. నగరంలోని ఆరు మెడికల్ ఏజెన్సీల లైసెన్స్‌లను నెల రోజులపాటు సస్పెండ్ చేశారు. అంతేకాకుండా వారి నుంచి రూ. 51. 92 లక్షల విలువైన ఇన్సులిన్ మందులను సీజ్ చేశారు. డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. నగరంలో పలు మెడికల్ డిస్ట్రిబ్యూటర్లు పోటీపడి..40 శాతానికి పైగా డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు. దీంతో అనుమానం వచ్చిన డీసీఏ అధికారులు.. మార్చి 15 నుంచి నగరంలోని పలు మెడికల్ ఏజెన్సీలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో నగరంలోని ఆరు మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై దాడులు జరిపి, సేల్‌బిల్స్‌ను పరిశీలించగా, వాటికి కొనుగోలు చేసిన బిల్లులేవని తేలింది. అంతేకాకుండా ఈ మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ ఢిల్లీ నుంచి ఎలాంటి బిల్లులేకుండా తక్కువ ధరకు ఇన్సులిన్ ఇంజెక్షన్లను కొని నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలింది. డీసీఏ నిబంధనల ప్రకారం బిల్లులేకుండా ఔషధాలను కొనడం డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్‌చట్టం 1940 ప్రకారం నేరం. ఇలాంటి మందులు వాడటం రోగులకూ ప్రమాదకరమే. కొన్ని రోజులుగా నగరంలోని మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై నిఘా పెట్టగా, ఆరుగురు మెడికల్ డిస్ట్రిబ్యూటర్లు అనధికారికంగా ఢిల్లీ నుంచి తక్కువ ధరకు ఇన్సులిన్ ఇంజెక్షన్లను బిల్లులేకుండా కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు సోమవారం సికింద్రాబాద్, పద్మారావునగర్‌లోని డ్రగ్ హబ్‌పై దాడులు జరిపి, 6.70 లక్షల విలువైన ఇన్సులిన్ ఇంజెక్షన్లను సీజ్ చేశారు. ఉప్పల్, రామంతాపూర్‌లోని శ్రీతిరుమల ఫార్మాపై దాడులు జరిపి రూ. 3.52 లక్షల విలువ చేసే ఇన్సులిన్‌ను, సుల్తాన్‌బజార్‌లోని శ్రీ పరాస్ మెడికల్ ఏజెన్సీపై దాడులు జరిపి రూ.9 లక్షల విలువ చేసే ఇన్సులిన్, నాగోల్, సాయినగర్‌లోని శ్రీగణేశ్ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ వద్ద నుంచి రూ.14.లక్షల విలువ చేసే ఇన్సులిన్, కాప్రాలోని శ్రీరాజరాజేశ్వర డిస్ట్రిబ్యూటర్స్ వద్ద నుంచి రూ. 2.70 లక్షల విలువైన ఇన్సులిన్‌ను, కాచిగూడలోని శ్రీబాలాజీ ఏజెన్సీ నుంచి రూ.16 లక్షల విలువైన ఇన్సులిన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

విలేకరులు కావలెను
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రిక
హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్
జిల్లాల్లో ఈ క్రింది ప్రాంతాల్లో పనిచేసేందుకు పార్ట్‌టైమ్ విలేకరులు కావలెను.

గ్రేటర్ హైదరాబాద్
1. గాజుల రామారం
2. గాంధీ ఆస్పత్రి
3. కూకట్‌పల్లి
4. రసూల్‌పుర
5. ఘట్‌కేసర్ రూరల్
6. సంతోష్‌నగర్
7. మహేశ్వరం
8. పహాడీషరీఫ్
9. చాంద్రాయణగుట్ట
10. గౌతమ్‌నగర్
11. అల్వాల్

రంగారెడ్డి
1. శంకర్‌పల్లి
2. కేశంపేట
3. కొందుర్గు
4. చౌదరిగూడ

వికారాబాద్
1. తాండూర్ టౌన్
2. వికారాబాద్ రూరల్
3. బంట్వారం
4. కోట్‌పల్లి
5. మోమిన్‌పేట

పరీక్ష తేది : మే 28 (2024) మంగళవారం
సమయం: మధ్యాహ్నం 2 గంటలకు
పరీక్షా కేంద్రం : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం
బంజారాహిల్స్- హైదరాబాద్